# ప్రెస్టేజింకెత్తైక్

శ్రీరాజ్

జీవితంలో తొలిసారి బాబ్జీకి కన్నీళ్ళు వచ్చాయి.

ఎందుకని?

గతుకుల రోడ్డుమీద బురద నీళ్ళలో చతికిలబడ్డ కుష్ఠురోగి ఒంటిమీద కారుతున్న కుళ్లు నెత్తుర్ని, దానిమీద ముసురుతున్న ఈగల్ని చూసినందువల్ల కన్నీళ్ళు రాలేదు. అసలు బాబ్జీ పుట్టిన తర్వాత ఎప్పుడూ అలాంటి మురికి మనుషుల్ని చూడలేదు. అయితే కన్నీళ్ళెందుకు వచ్చాయి?

అతని మనసులో ఓ అపరంజి బొమ్మ అందమైన హరివిల్లులా చోటు చేసుకొని తను నవ్వుతూ అతన్ని నవ్విస్తూ అంతలోనే అతన్ని ఒంటరిచేసి, పిలుపుకి అందనంత సుదూరాలకి వెళ్ళిపోయినందుకు బాబ్జీకి కన్నీళ్ళు రాలేదు. ఆ మాటకి వస్తే ప్రేమించే వయస్సు వచ్చినా, చొరవచేసి ఏ అమ్మాయీ అతని మనసులో చోటుచేసుకోలేదు. ఆశ్చర్యం. మరయితే— కన్నీళ్ళెందుకు వచ్చాయి?

బాబ్జీకి అన్నీ ఉన్నాయి. ఉన్నవాళ్ళకి ఉన్న ఒక్కగానొక్క కొడుకు. అందంగా ఉంటాడు. అంతకన్న ఆరోగ్యంగా ఉంటాడు. కొద్ది రోజుల్లో ఫారిన్ వెళ్ళి, పెద్ద చదువులు చదువు కుంటాడు. తర్వాత—స్వదేశానికి తిరిగివచ్చి, ఏ కార్ల ఫ్యాక్టరీయో పెట్టేస్తాడు. ప్రభుత్వానికి అండగా నిలుస్తాడు. ప్రజానీకానికి సాయపడతాడు. ఇన్ని ఉన్నవాడు, ఇంత గొప్పవాడికి కన్నీళ్ళెందుకు వచ్చాయి? అతను పుస్తకాల్లో సినిమాల్లోనే కన్నీళ్ళగురించి తెలుసుకున్నాడు. కన్నీళ్లు యెలా ఉంటాయో చూశాడు. కానీ నిజజీవితంలో యెలాంటి కన్నీటి కథలు అతన్ని చేరలేదు.

ఎందుకు....ఎందుకు....ఎందుకు....? ఆ మహానుభావుడికి కన్నీళ్ళెందుకు వచ్చాయి?

ఒకసారి బాబ్జీ తన స్నేహితులతో కలిసి, ఓ ఇంగ్లీషు సినిమా చూశాడు. సినిమా ఎలా ఉన్నప్పటికీ అందులో చూపించిన ఒక కారు చాలా బాగా నచ్చింది. అలాంటి కారును కొంటే గింటే ఒక్క బాబ్జీయే కొనాలన్నారు, అతని మిత్రులు. అవును. ఉంటే గింటే అలాంటి కారు తనకే ఉండాలనుకున్నాడు, బాబ్జీ. అలాంటి కారు ఆ ఊళ్ళో యెవరికీ ఉండకూడదు. ఎవరి దగ్గరా లేనిది తన దగ్గర ఉంటేనే గొప్పదనం. అదొక సరదా. ప్రెస్టేజ్. అందుకే—అలాంటి కారుకోసం వారంరోజులు అన్వేషణ చేశాడు. అదే కారు కాకపోయినా అలాంటి మరో జయంట్‌లాంటి ఇంపాలా కారు దొరికింది. ఎవరో ఓ దొరగారు-ఇండియా వదిలేస్తూ తన దగ్గర ఉన్న కారూ గట్రా అమ్మేస్తున్నాడని తెలిసి, ఆ దొరగార్ని కారు అమ్మమని బాబ్జీ అడిగాడు. లక్షరూపాయలు యిస్తే, కారు అమ్మేస్తానన్నాడు ఆ దొరగారు.

బాబ్జీ తనకి అర్జంటుగా లక్షరూపాయలిమ్మని, కారు కొనే తన ఉద్దేశాన్ని తండ్రికి తెలియజేశాడు. ఆ తండ్రీకొడుకులు ఏడాదికి ఒకటి, ఒకటిన్నరసార్లు కన్నా ఎక్కువ మాట్లాడకోరు. అదీ టెలిగ్రాఫ్ భాషలో మాట్లాడుకుంటారు.

లాన్స్‌లో తీరిగ్గా కూర్చొని, గులాబిపూలని గడ్డిపూలని వేరువేరుగా చూస్తూ, వాటిలో వర్గభేదాన్ని ఆలోచిస్తూ వాటిని సృష్టించిన దేవుడి తెలివితేటలకి నవ్వుకుంటున్న బాబ్జీ నాన్నగారు 'లక్షరూపాయలు' మాట విని, కొడుకువేపు ఎగాదిగా చూశాడు. లక్షరూపాయలు అడిగే

యెత్తుకి యెప్పుడు యెదిగిపోయాడా అని కాసేపు ఆలోచించి, 'నో' అని టెలిగ్రాఫ్ భాషలో చెప్పాడు. అక్కడ ఉండకుండా వెళ్ళిపోయాడు.

ఆ 'నో' బాబ్జీకి జీవితంలో తొలిసారి కన్నీళ్ళు వచ్చేటట్లు చేసింది.

మూడు రోజుల్లో లక్షరూపాయలిచ్చి, ఆ దొరగారిదగ్గర ఉన్న జయంట్‌లాంటి కారు తీసుకోవాలి. తన పరువు నిలబెట్టుకోవాలి. లేకపోతే—ఆ కోరు మరొకరి చేతికి పోతుంది. ఆ మరొకరు తనకన్న మించిపోతారు. తన స్నేహితులదగ్గర చిన్నబుచ్చుకోవాలి. అందుకే_



లక్షరూపాయలకి వచ్చిన జవాబు 'నో' విన్న ప్పట్నుంచీ బాబ్జీకి కన్నీళ్ళు ఆగడంలేదు.

హైకోర్టుమీద సుప్రీంకోర్టు ఉన్నట్లు— బాబ్జీ తన కన్నీళ్ళు వాళ్ళ అమ్మకి చూపిం చాడు. ఆ కన్నీటి వెనక దాగిన గాధా బాధా చెప్పుకున్నాడు. రెండు రోజుల్లో లక్షరూపా యలు అడిగి యిమ్మన్నాడు. లేకపోతే తను అందర్నీ విడిచి శాశ్వతంగా వెళ్ళిపోతా నన్నాడు, ఆత్మహత్య చేసుకొని.

* * *

జీవితంలో తొలిసారి లావణ్యకి ప్రేమ పుట్టుకొచ్చింది.

ఎవరిమీద?

తన పేగుమీద, నవమాసాలు మోసి కన్న కొడుకుమీద అంటే మీరు నవ్వుతారా? అంతే మరి—కనడంతో తన డ్యూటీ అయిపోయిం దని, పిల్లల్ని పెంచడం గించడం డబ్బు తీసు కుంటున్నందుకు నౌకరు వెధవలు చూసు కుంటారని ఊరుకుంది. ఏ రోజూ కొడుకు గురించి విచారించలేదు. అందుకే కొడుకుమీద ప్రేమా, వాత్సల్యం, అనురాగం లాంటివి ఎప్పుడూ పుట్టుకురాలేదు. ఇరవై ఏళ్ళ తర్వాత జీవితంలో తొలిసారి ఆమెకి కొడుకుమీద ప్రేమ పుట్టుకొచ్చింది.

మిసెస్ లావణ్యా వయస్సు ఇరవై సంవత్స రాల క్రితం సరిగ్గా పద్దెనిమిదేళ్ళు. ఆమె వయస్సు గురించి చెప్పుకొనేటప్పుడు ఏ పద్దెని మిదో, ఇరవయ్యో వినిపించాలి. లేకపోతే— మూతి పళ్ళు రాలగొడుతుంది యెవర్నైనా సరే!

ఆమె జీవితాంతం మిస్‌గానే ఉండిపోవా లనుకుంది. కానీ, మిస్‌గా ఉంటే జీవితంలో పొందవలసిన చాలా అనుభూతులు మిస్ అయిపోతాయని పెళ్ళి చేసుకుంది. ఆమె పెళ్ళి చేసుకుంది గనుకనే మిసెస్ అయిందిగాని, ఆమెను చూసిన వాళ్ళెవరైనా మిస్సనే ఇప్ప టికీ అనుకుంటారని ఆమె అంటుంది. నిజమే. ఆమె అందం వన్నెతరగని పాలాబంగారం. ఆ అందం ఆమె వయసుని తగ్గిస్తుంది. డెస్డిమోనో సౌందర్యం లావణ్యముందు వెలవెలపోతుంది.

ఆమె ఆకాశానికి వస్తానంటే చంద్రుడు వెన్నె లకి డైవోర్సు యిచ్చేస్తాడు. ఆ అందాన్ని కాపాడుకోవడంకోసం ఒక సంతానానికి మాత్రమే అంగీకరించింది. 'మళ్ళీ నీళ్ళు పోసు కుంటే చూడాలని ముచ్చటగా ఉందని' పతి దేవుడు ప్రాధేయపడినప్పటికి లావణ్య'లాభం' లేదంది.

లావణ్యకి పుట్టినింటి వాళ్ళన్నా, పుట్టిన దేశం అన్నా ఎలర్జీ. ఈ దేశంలో తనని కనడం తప్పయితే, తన తల్లిదండ్రులు బుద్ధి లేకుండా (ఆస్తి బాగా వుంది గనక) తనని చిన్నప్పట్నించి ఫారిన్‌లో వుంచి చదువు చెప్పించకపోవడం రెండో తప్పు చేశారట. ఆడపిల్లవి, అందులో లైఫ్ సెక్యూరిటీ లేని విదేశాల్లో ఒంటరిగా వుండలేవని ఆమె కోరికని ఎప్పుడుకప్పుడు కొట్టిపారేశారు ఆమె తల్లిదండ్రులు. పోనీ, ఓ ఫారినర్‌తో తన పెళ్ళి జరిపించారంటే అదీ లేదు. సాంప్రదాయం అడ్డువచ్చింది. అదిగో ఆ సాంప్రదాయాలు ముసుగులో ముసలయి పోతున్న ఈ దేశం అంటే మహాకోపం. కట్టుబాట్ల తాడుతో ఆడదాని స్వేచ్ఛనీ, ఆనం దాన్నీ ముడివేసి, చీకటిలోవున్న గుంజకి కట్టేసిందీ దేశంలోనే.

'ఈ దేశంలో డిస్సెడ్వేంటేజ్ మరొకటి వుంది. డబ్బున్నప్పటికీ మనం కావాలను కున్నది, కోరుకున్నది యిక్కడ దొరకదు. ఆనందానికి కత్తెర్లు అడ్డుపెడతారు. జీవితంలో థ్రిల్‌కి నిర్దాక్షిణ్యంగా బ్లాక్ పెయింట్ చేస్తారు' అని అంటుంది కూడా.

లావణ్యకి క్లబ్బుకి వెళ్ళడమన్నా, గంటల తరబడి పేకాడ్డమన్నా మహా సరదా. ఆ ఒక్క సరదా లేకపోతే లావణ్య ఏమై పోయేదో? క్లబ్బుకి తీసుకువెళ్ళిన డబ్బు అయిపోతే, ఫోన్‌లో చెక్కులు డ్రా చేసి మరీ ఆడుతుంది.

ఆరోజు పేకాడుతుంటే డబ్బులు అయి పోయాయి. చెక్కు రాసివ్వడానికి బ్యాంక్ హాలిడే. పేకాట విడిచి బాధగా ఇంటికి తిరిగి వచ్చిన లావణ్యకి-మరింత బాధగావున్న బాబ్జీ

కనిపించాడు. కన్నీళ్ళు చూపించాడు. ఆ కన్నీటి వెనకవున్న కారుకథ వివరించాడు తల్లికి.

ఇంపాలా కారుని కొనాలనే కొడుకుని చూసి లావణ్యా మురిసిపోయింది. అంతమంచి ఆలోచన పెట్టుకొనే ఎత్తుకి ఎప్పుడు ఎదిగి పోయాడని ఆలోచించి-'యస్' అని ప్రేమగా తల నిమిరింది. అదిగో అలాంటప్పుడే కన్న కొడుకుమీద జీవితంలో తొలిసారి ప్రేమ పుట్టుకొచ్చింది.

రాత్రి పడక గదిలో నైట్ గౌను మార్చు కుంటూ, భర్తను ఉద్దేశించి లావణ్యా అంది— "బాబీ మిమ్మల్ని లక్ష అడిగాడట. మీరు 'నో' అన్నారట. నిజమా?" ఏ సందర్భంలో ఆమె భర్తను అర్థించదు. ఆజ్ఞాపిస్తుంది. అమ్మగారి మాటమీద, బాబుగారి మాట కింద వుండాల్సిందే.

నారింజరంగు లైటు వెలుగులో మెత్తని పరుపుమీద కూర్చొని, బూతు పుస్తకంలో బట్టల్లేని బొమ్మల్ని-భగవద్గీతలోని శ్రీకృష్ణ భగవాణ్ని చూసి తరిస్తున్నట్లుగా మత్తుగా కసిగా చూస్తున్న అతను, భార్య మాటకి వులిక్కిపడి 'అవును' అని సమాధానం యిచ్చాడు.

అంతే! నారింజ రంగులైటు ఆరిపోయింది. అంతా చీకటి. ఏమీ కనిపించనంత చిక్కటి చీకటి పరుచుకుంది. ఈ సీనులో దృశ్యంలేదు. శబ్దం మాత్రం మహా జోరుగా వుంది.

"చూడండీ! మనకి వున్నది వాడొక్కడే. మనకి వున్నది వాడిదే. లక్ష యివ్వకపోతే చచ్చిపోతానంటున్నాడు. వాడు లేనితర్వాత ఈ లక్షలెందుకు? అయినా-బాబీ ఎంత అడి గాడు. ముష్టి లక్ష. ముష్టి వెధవలకి పంచి పెట్టడానికి అడగడంలేదండీ. ఇంపోర్టెడ్ ఇంపాలా కారు కావాలని ముచ్చటపడు తున్నాడు. వాడికి అంత మంచి ఆలోచన వచ్చినందుకు మీరు ముచ్చటపడాలి. వాడి ఆలోచనల ఖరీదు లక్షల విలువ చేస్తుందని గర్వపడాలి....ఇంట్లో డబ్బే యిస్తారో, వీధిలో సొమ్మే యిస్తారో నాకు తెలేదు. మీరు బాబీకి లక్ష యిచ్చితీరాలి. లేదంటారా....నా నగా గట్రా అమ్మేస్తాను. చాలకపోతే, నే నెవరికైనా అమ్ముడుపోతాను. బాబీకి కావలసిన డబ్బు యిస్తాను. ఆలోచించు కోండి...." ఆమె హెచ్చరికకు తిరుగులేదు. తర్వాత-అంతా నిశ్శబ్దం.

ప్రాబ్లెం రేపటికి సెటిలయిపోతుందనే ధైర్యంతో లావణ్యా తొందరగా నిద్రలోకి జారిపోయింది.

* * *

జీవితంలో తొలిసారి పరమహంసకి దెబ్బ తగిలింది.

అయ్యో, ఎక్కడ?

అతని ఒంటిమీద అనుకుంటే పొరపాటు పొరబడినట్లే. స్వాతంత్ర్య పోరాటంలో ఒళ్ళు విరిచి, ఆంగ్లేయుల తుపాకీ గుళ్ళకి ఎదురుగా నడిచిన రోజుకూడా అతనికి పిసరంత దెబ్బ తగల్లేదు. పోనీ-మనసనే గ్లాసుమీద తగిలి, పగిలిపోయిందనుకుంటున్నారా? అలా అను కుంటే నేను నవ్వుతాను. మురికిపేటలో గుడి సెలు కాలి బూడిద కాగా, వాళ్ళకి అందజేసిన సహాయంలో సగానికిపైగా మిగుల్చు కున్నప్పుడు-అతని మనసు నిజంగా గ్లాసే అయితే పగిలిపోయేది. దారుణంగా ప్రమా దానికి గురైన కార్మికుల కుటుంబాలకు ముట్ట జెప్పిన నెత్తురు కూడులో వాటా తీసుకున్న రోజున అతని మనసు ముక్కలయిపోయేది. బంగారంలాంటి అతని అంతస్తు పునాది రాళ్ళను తడిపి, గట్టిచేసినది పేదవాళ్ళ కన్నీళ్ళూ, ఊపిరే అని తెలుసుకున్న క్షణంలో అతని మనసు బద్దలయిపోయేది. కానీ, అది పగల్లేదు. బద్దలు కాలేదు. కాబట్టి అతని మనసుకి దెబ్బ తగిలిందనుకుంటే పొరబడి నట్లే. తన ఉప్పు తింటున్నవాడు, తన రహ స్యాన్ని బయట కక్కినందుకు ఏళ్ళ తరబడి సంపాదించుకున్న పరమహంస మంచితనం మీద దెబ్బ తగిలింది. అతని గుడ్‌విల్‌కి దెబ్బపడింది. అది అతని ఫ్యూచరికి కాన్స రవుతుంది.

ఆ పరిసర ప్రాంతాల్లో ఉన్నవారికి గాంధీ,

నెహ్రూ అంటే యెవరో తెలీదు. అలాంటి వాళ్ళు—తమ కంపెనీలో ఏదో డిపార్టు మెంటులో పనిచేస్తున్నారు కాబోలనుకుంటారు. రాజకీయాలు గురించి, నాయకుల గురించి మాట్లాడుకొనేటప్పుడు వాళ్ళకి శ్రీమాన్ పరమహంసగారే గుర్తుకు వస్తారు. యూనియన్ ప్రెసిడెంటుగా, కార్మికసంఘ నాయకుడుగా కాలనీ పెద్దమనిషిగా, రాజకీయ నీతిపరుడుగా, మలినంలేని మంచివాడుగా, చాలా ఉత్తముడుగా, జాతిరత్నంగా .... ఇలా ఎన్నో రకాలుగా అతన్ని ఎరుగుదురు. వాళ్ల ఉద్యోగాలు నిలబడ్డానికి, జీతాలు పెరగటానికి, వారసత్వం చట్టం అమల్లోకి రావడానికి, కార్మికుడికీ యజమానికీ మధ్య సత్సంబంధాలు కుదరడానికీ.... యిలా యెన్నో సాధించడానికి అతనే కారణం అంటారు. వాళ్ల ఉద్యోగాలు నిలబెట్టినప్పుడు పరమహంస తనవాళ్లకి ఉద్యోగాలు వేయించుకున్నాడని, జీతాలు పెంచినప్పుడు అతను బంకళా కట్టించాడని, వారసత్వం చట్టం వచ్చినప్పుడు కారు కొన్నాడని, కంపెనీకి వర్కర్సుకి మధ్యసత్సంబంధాలు కుదిర్చినప్పుడు పెద్ద మొత్తం కమీషన్ కొట్టేశాడని పూర్ ఫెలోస్ వాళ్ళకి తెలీదు. వాళ్ళకి దొరలా కనిపిస్తూ బ్రతకడమే పరమహంస ప్రత్యేకత.

క్రిందటి రాత్రి—అతని అర్ధాంగి అల్టిమేటం యిచ్చింది, 'లక్ష యిమ్మని'.

'డామిట్....ఒకటికి అయిదు సున్నాలు చేరిస్తేగాని లక్షకాదు. ఒక్కొక్క సున్నా వెనుక యెంత శ్రమ దాగి ఉంటుందో నీకు తెలుసా?' అని మనసులో అనుకున్నాడుగాని పైకి మాత్రం అనలేకపోయాడు. లక్ష ఇవ్వకపోతే లావణ్య అన్నంతపని (ఎవరికైనా అమ్ముడు పోవడం) చేస్తుంది. ఈ అల్టిమేటం గురించి ఆలోచించక తప్పలేదు. 'ముద్ర వెధవకి సరదా తీర్చుకుందుకి లక్ష కావాలిట' పరమహంసకి బాజ్జీమీద కోపం వచ్చింది.




ఇనప్పెట్లోది తీసిగాని, బ్యాంక్‌లోది డ్రా చేసిగాని లక్షరూపాయలు కారుకోసం తగల బెట్టలేడు. గడించినదాంట్లో లక్ష తరిగిపోతుంది. తను ఒక లక్ష కిందికి ఉండాలి. ఇంతవరకు జీవితంలో మీదికే వెళ్లాడు. ఆ రాత్రి లక్ష గురించి లక్ష ఆలోచనలు ఆలోచించాడు. ఆ లక్ష నుండి లక్షలు విలువచేసే లక్షణమైన ఓ ఆలోచన తట్టింది. తన ఇనప్పెట్లోదిగాని, బ్యాంక్‌లోదిగాని డబ్బు తీయవలసిన అవసరం లేదు.

బోనసులు యివ్వటానికి నిరాకరించిన యాజమాన్యాన్ని నిరసిస్తూ, నలభై రోజుల్నుండి సమ్మె సాగిస్తున్నారు కార్మికులంతా. అంతా ఒక్క మాటమీద ఒక బాటమీద నడుస్తున్నారు, కంపెనీ యజమానుల్ని తమ దారికి తీసుకురావటానికి. కానీ, యజమానులు దారికి రాలేదు. అడ్డదారులు వెదికారు. బోనసులు యిస్తే ఏడాదికి పదిలక్షలు ఖర్చవుతుంది కంపెనీకి. ఒకసారి బోనసు ప్రకటిస్తే, అది జన్మహక్కుగా మారిపోతుంది కార్మికులకు. ఇచ్చేవాడుంటే యెన్నిసార్లయినా చెయ్యి చాపి అడుక్కుంటారు. అందుకే—యూనియన్ ప్రెసిడెంటుగారికి కబురు చేశారు. స్ట్రయిక్ కాలాఫ్ చేస్తే, ప్రతిఫలంగా లక్షన్నర నెట్ క్యాష్ ఇస్తానన్నారు. మధ్యవర్తి సంప్రదింపులు సాంప్రదాయ బద్ధంగా జరిపించారు.

సమ్మెలో విజయం సాధిస్తే, కార్మికులకు బోనసులు అందితే కృతజ్ఞత పేరుతో తనకి వచ్చేది ముష్టి పదివేలుకన్న ఎక్కువ ఉండదు. కాని యాజమాన్యంతో తన చేతులు కలిపితే, ఇంట్లో అల్టిమేటంను తట్టుకోవచ్చు. ఇంకా యాభైవేలు యినప్పెట్లో జాగ్రత్త చేయొచ్చు. పరమహంస ఆలోచనకి తిరుగుండదు.

అమోఘమైన తెలివితేట లుపయోగించి, సమ్మెను కార్మికులచేత విరమింపజేశాడు. 'ప్రెసిడెంటుగారు సెప్పారు. మనం పనిలోకి జేరిపోవాల' అందరూ చేరిపోయాడు. పరమహంస చేతికి లక్షన్నర ముట్టింది. 'తొందర్లో బోనసు లిత్తారంట' లాంటి ఆశ కార్మికుల్లో మిగిలింది. బుర్రలో కాస్త తెలివి ఉండాలేగాని మందలాంటి జనాన్ని యెలాగైనా నమ్మించ వచ్చును.

ఇరవై ఏళ్లగా అతను వాళ్ళని నమ్మిస్తున్నాడు. వాళ్ళ మంచితనం పొందుతున్నాడు. కానీ ఈ రోజున ఏళ్ళ తరబడి తను సంపాదించుకున్న మంచితనంమీద దెబ్బ తగిలింది. తను లాలూచీలు చేసి సమ్మెను విరమించినట్లు యజమానుల దగ్గిర డబ్బు తీసుకొని కార్మికులకు అన్యాయం చేసినట్లు వదంతులు మొదలయ్యాయి. అవి అంటురోగంలా అందర్నీ సోకి, తన వినాశనానికి దారి తీస్తాయి. తనలో గుట్టుగా ఉన్న మరో మనిషిని ఎవరు బయటకు లాగారు?

పరమహంస కళ్ళు ఎర్రబడ్డాయి. ఎర్రబడ్డ సూర్యుడిలా కోపం బుసలుకొట్టింది, బుసలు కొట్టే కోడెత్రాచులా. ఆ వేశం వరదలై పొంగింది, పొంగిన వరదలా.

తన ఉప్పు తింటూ బతుకుతున్నవాడు ఎదురుగా నిలబడి వున్నాడు. చేతులు కట్టుకొని, నేలచూపులు చూస్తూ, మంచివాడిలా మంచి పోజు పారేస్తున్నాడు.

"ఈ యింటి ఉప్పు తింటున్న సంగతి యెప్పుడు మరచిపోయేవు?"

"లేదు సార్...."

చెంప ఛెల్లుమంది—ఉప్పు తిని బ్రతుకుతున్నవాడికి.

"నిన్ను నా సొంతమనిషిలా చూసుకున్నాను. నాతో తిప్పుతున్నాను. నేనుచేసే ప్రతి పనీ నీ చేతిమీదుగా జరిపించాను. ఎందుకని? నీ మీద నమ్మకం ఉండటంచేత. నీలో కుక్కకున్న విశ్వాసం ఉందని నమ్మడంచేత. కానీ, నువ్వు మామూలు కుక్కలా వాళ్ళ మధ్యకి పోయావు. వాళ్ళకి బోనసులు లేకుండా, అన్యాయం చేశానని అరిచావు. నా మంచితనానికి మచ్చ పెట్టావు. ఇన్నాళ్ళు లేనిది—ఈ రోజున నీ బుద్ధి యెందుకు మారింది? బాస్‌ని మోసగించి, బాగుపడాలనే ఉద్దేశం యెప్పుడు కలిగింది? డబుల్‌గేమ్‌తో డబ్బు సంపాదించాలనే ఆలోచన యెప్పుడు వచ్చింది? యూ....

చీట్..... రెచెడ్....కట్ త్రోట్....నేను సహించను.

"నిప్పు పెట్టినవాడివి నువ్వు. తొందరగా నీళ్ళుపోసి, రగులుతున్న మంటల్ని ఆర్పు. లేకపోతే నీ నూరేళ్ళ బ్రతుకును ఆర్పేస్తాను. చితి పేర్చి నిప్పు పెట్టేస్తాను. నీకు అన్నీ చేతనవును. చేతనవును గనకనే నీ కీ ఛాన్స్ యిస్తున్నాను. వెళ్ళు.... వెళ్ళు.... వెళ్ళు...."

పరమహంస మాటలకి ఉప్పు తింటూ బ్రతుకుతున్నవాడు గజగజ వణికిపోయాడు. అది గమనించకుండా పరమహంస అక్కడ నుండి విసురుగా వెళ్ళిపోయాడు. తన గుడ్ విల్ పొజిషన్ నార్మల్‌కి తెస్తాడనే నమ్మకం అతని అంతరాల్లో లేకపోలేదు.

* * *

జీవితంలో తొలిసారి నారాయణకి ఆపద వచ్చింది.

ఎలాంటిది?

పుట్టిన బిడ్డకి తల్లిపాల్లేక పాలడబ్బాకోసం బజారుకి వెళితే, అది బ్లాక్‌లో అమ్ముడు పోగా —యేం చేయడానికి పాలుపోక, నిస్సహాయంగా నిలిచిన సామాన్య తండ్రికి వచ్చిన ఆపదలాంటిది కాదు. కన్నకూతురు గుండెల మీద బరువుకాగా, కట్నాల మార్కెట్టులో బేరం కుదరక, పెళ్ళి చేయలేక, గొంతు పిసికి చంపలేక—తను చావలేక బతకలేక మొండిగా మిగిలిన మధ్య తరగతి మనిషికి వచ్చిన ఆపద కాదు. నారాయణకి వచ్చిన ఆపదకు అర్థం వేరు.

ఆ ఆపద అర్థం తెలుసుకోవాలంటే— పరమహంసకి నారాయణకి మధ్య జరిగిన కథా కమామీషూ ముందుగా తెలుసుకొని తీరాలి.

నారాయణ 'మినీ మ్యాన్' అనుకుంటున్నారా? అతను వయసులో, బుద్ధిలో, ఆలోచనలోకూడా చిన్నవాడు కాదు. మధ్యతరగతిలో 'ఏ' వర్గం 'బి' వర్గం రెండు ఉన్నాయి. 'ఏ' బాపతు బాగా చదువుకున్నవాళ్ళు. బతకడం చేతకానివాళ్ళు. నీతీ న్యాయమూ అని వేళ్ళాడుతారు. జీవితంలో ఓడిపోయి, వేలాడిపోతారు. 'బి' వర్గం బ్రిలియంట్స్. చదువు లేకపోయినప్పటికి బతకడం చేతనయినవాళ్ళు. ఓ పెద్ద వాడి నీడను చేరి, అతన్ని అండగా చేసుకుంటారు. ఆ నీడను ఆకాశానికి ఎత్తేస్తారు,అడుగులకి మడుగులు వత్తుతారు. బానిసల్లా పడి ఉంటారు. ఆ అండ—ఎంగిలిచేసి విడిచేసినది అందుకుంటారు. ఆ ఎంగిలిమెతుకుల్లో మేలిమి బంగారాన్ని తీసి, మేడలూ మిద్దెలూ కట్టించేస్తారు. బ్లాకులో అమ్ముడయ్యే పాలడబ్బాలు, కట్నాల మార్కెట్టులో బేరం కుదరని గుండె బరువులు, పరీక్ష ఫీజులు కట్టని కాలేజీ చదువులు, డబ్బులేక నిర్లక్ష్యం చేసిన రోగాలు లాంటి ఆపదలు వాళ్ళకి ఉండవు. అదిగో— అలాంటి ఆపదలు లేని వర్గానికి చెందినవాడే నారాయణ.

సింహంలాంటివాడు పరమహంస అయితే —ఆ సింహాన్ని అంటిపెట్టుకొని, నిత్యం తిరిగే గుంటనక్క నారాయణ. ఇది ప్రజల నానుడి. నిజానికి సింహానికి ఆకలిగా ఉన్నప్పుడే వేటాడుతుంది. తనకి కావలసినది, కావలసినంత తిని ఊరుకుంటుంది. కానీ, ఈ సింహం స్వభావం వేరు. కడుపులో దండిగా ఉన్నప్పటికీ అవకాశం దొరికితే వేటాడుతుంది. రక్తం తాగేస్తుంది. మాంసం తినేస్తుంది. నక్కకి మిగిలేవి ఎముకలు బొమికలు మాత్రమే.

ఆ ఎముకలు బొమికలతోనే గుంటనక్క అని పిలవబడే నారాయణ చక్కని మేడలు కట్టించాడు. అద్దెలమీద నెలకి వెయ్యి పైగా గడిస్తున్నాడు. టాక్సీలు నడిపిస్తున్నాడు.వడ్డీలకు డబ్బు తిప్పుతున్నాడు. ఇంకాయేవో లాభసాటి వ్యాపారాలు చేస్తున్నాడు.

"బతకడానికి డబ్బు కావాలి. డబ్బు కావాలంటే నేను పరమహంస బాబుగారిదగ్గర పడి ఉండాలి. నేను నీకు మొగుణ్నే. కాదనను.కానీ, నీతో కాపురం చేయటానికీ, కబుర్లు చెప్పటానికీ నాకు టైం ఉండదు. వీలుంటే వచ్చే జన్మలో కాపురం చేసుకుందాం" భార్యతో కాపురం చేయడం మానుకున్నాడు, నారాయణ. అయ్యగారి చీకటి వ్యవహారాలన్నీ అతనే చూడాలి. చీకటినుండే పసిబిడ్డ పుడుతుంది.

చీకటినుండె తెలివి ఉద్భవిస్తుంది. చీకటినుండే డబ్బు వస్తుంది. బాబుగారికి బ్రాందీ అందివ్వడం మొదలుకొని, ఇనప్పెట్లో డబ్బు దాచేవరకు అన్నీ నారాయణ చేతులమీదుగా జరగాల్సిందే. పరమహంసబాబు యింట్లో ఉన్నా, వీధిలో తిరిగినా, ఢిల్లీ కెళ్ళినా, కంపెనీలో కాలు పెట్టినా, కారులో కదిలినా, విమానంలో ప్రయాణం చేసినా—అతనిప్రక్క నారాయణ ఉండాల్సిందే. అతనికీ బాబుగారి సమక్షంలోనే కాలం గడిచిపోతుంది. కాపురం చేయడానికి తీరిక దొరికేది ఎప్పుడు?

ఒక సందర్భంలో అంతటి భక్తుడికి స్వామి ద్రోహం చేయాలనే తలంపు కలిగింది.

ఆ రోజు—లక్షన్నర కంపెనీ మేనేజ్ మెంటువారినుండి తీసుకొని, పరమహంస బాబు యినప్పెట్లో దాచేటప్పుడు, ఎంగిలి మెతుకులమీద ఏవగింపు కలిగింది నారాయణకి.

ఎన్నాళ్లు ఎంగిలి మెతుకులతో సరిపుచ్చుకోవాలి? బాబుగారు ఏం కష్టపడ్డారు గనక లక్షన్నర తీసుకుంటున్నారు? ఆ సొమ్ములో తనకీ వాటా యెందుకు యివ్వకూడదు? ఇలాంటి ఆలోచనలు నారాయణ బుర్రలో కలిగాయి.

"బాబుగారూ! ఇది అన్యాయం. ఆలోచన నాది. శ్రమ నాది. మీ గురించి నా పెళ్ళాంతో కాపురం చేయడం మరిచిపోయాను. కానీ, నాకు ఎంగిలి మెతుకులతో సరిపెడ్తేస్తున్నారు. న్యాయంగా నాకూ వాటా యివ్వాలి. మీరు పెద్ద దొంగయితే, నేను చిన్న దొంగను. మీ సుపుత్రుడికి ఇంపాలా కొంటే, మా కుర్రాడికి స్కూటరయినా కొనాలిగదా! మీరు కాదంటే —మీ జాతకం పదిమందిలో చదివేస్తాను. తర్వాత మీ యిష్టం" అని బెదిరించాలనుకున్నాడు, మనసులో. కానీ, అలా అడగలేదు. అడగలేకపోయాడు.

"బాబుగారూ! అయిదువేలు నా మొహాన్ని కొట్టండి. చాలా అవసరాలున్నాయి అని" చాలా వినయంగా అడిగాడు, ఇనప్పెట్టె తాళంచెవులు పరమహంస చేతికిస్తూ.

నారాయణవేపు ఎగాదిగా రెండుసార్లు కోపంగా చూశాడు! పరమహంస. రెండువందలు తీసి, నారాయణ మొహానికేసి కొట్టాడు, మళ్ళీ అలా అడగొద్దని వార్నింగిస్తూ.

నారాయణకి ఉక్రోషం పొడుచుకొచ్చింది. ఆ క్షణంలో తన తెలివితేటలతో బాబుగార్ని సర్వనాశనం చేయాలనిపించింది. బోనసుల విషయంలో అయ్యగారు చేసిన అన్యాయాన్ని జనాలకి చెప్పేస్తే, తర్వాత కథ దానంతట అదే నడిచిపోతుందని ఆలోచించాడు.


అక్కడ ఉన్న జనాలు ఒక గొర్రెమంద. ఆ మందని మాయచేసి యెటైనా తీసుకుపోవచ్చును. ఏ గోతిలోకైనా దించవచ్చును. అలాంటి మందలో ఒక గొర్రెపిల్ల ఉంది. అది అప్పుడప్పుడు మందని అనుసరించకుండా వెనక్కి ఆగిపోతుంది. పైగా మెడ తిప్పుతూ అన్నివేపులకి చూస్తుంది. ఆ విషయాన్ని—చాలాసార్లు గమనించిన నారాయణ, గొర్రెపిల్లను చేతుల్లోకి ప్రేమగా తీసుకొని—'అయ్యగారు చేసిన అన్యాయాన్ని' చెవిలో ఊదాడు.

అదీ సింహానికి గుంటనక్కకి మధ్య జరిగిన కథాకమామిషూ.

పరమహంస—ఆవులించకుండానే ఎదుటివాడి పేగులు ఎన్నో లెక్కకట్టేస్తాడు. ఆవులిస్తే పేగులు బయటకి లాగి, పేగులు గలాన్నే లెక్క చూసుకోమంటాడు. ముందు రోజున అయిదువేలు అడగడం, మర్నాడు జనాల్లో వదంతులు లేవడంవలన—నారాయణ 'నమక్ హారామ్'లా దొరికిపోయాడు.

నారాయణ తెలివితేటలు బాగానే ఉపయోగించాడుగాని తొందరపడ్డాడు. తొందరపడి, తన పేగులు లెక్కకి యిచ్చేశాడు. బాబుగారు అన్నంత పని చేస్తారు. మనిషిని కాల్చి బూడిద చేస్తారు. దీనికి మరో అర్థమే ఆపద. చాలా మందికి ఆపదలు వచ్చాయి. కానీ, కాలి బూడిద కాకముందే బాబుగారు చెప్పినట్లు చేసి, ఆపదలు తప్పించుకున్నారు. ఇప్పుడు—తను బాబుగారు చెప్పినట్లు చేయకపోతే ఆపదకి గురైన మొదటి వ్యక్తి నారాయణే అవుతాడు.

జీవితంలో తొలిసారి నారాయణకి ఆపద




వచ్చింది. ఆ ఆపదనుండి బ్రతికి బయట పడాలి.

ఆ రోజు బాబుగార్ని అడిగి, సెలవు తీసుకున్నాడు. ఆ రోజంతా మందు కొట్టాడు. మందు కొడుతూ ఆలోచించాడు.

మందు బాగా పని చేసింది. మంచి ఆలోచన తట్టింది.

గొర్రెపిల్లదగ్గరకి నారాయణ మళ్ళీ పరుగెత్తాడు.

"చూడబ్బాయ్....నువ్వేదో చదువుకున్నవాడివని, తెలివైనవాడివని, చురుకైనవాడివని అనుకున్నాను. యూనియన్ ప్రెసిడెంట్‌గార్ని యెదిరించి అడిగే గుండెనిబ్బరం ఉందని అంతా నీతో చెప్పాను. కానీ, విని నువ్వూరుకున్నావు. మరో పదిమందితో చెప్పేస్తే, నీ డ్యూటీ అయిపోయిందనుకున్నావు. అవునా? పదిమంది పదిమంది చెవులు కొరుక్కోవడంతో సరిపోతుంది. అందరూ కలిసి రావాలి. నువ్వు నడుంకట్టి ముందుకి సాగాలంటే—అక్కడ అయ్యగారు మీకోసం ఎదురుచూస్తూ ఉందరు. ఏదో ఆలోచిస్తాడు. తనని తాను ఉద్ధరించుకోవడానికి ఏమైనాచేస్తాడు. నష్టపోయేది నువ్వూ.... నీ జనాలూ....

"ఆలస్యం చెయ్యకుండా యిప్పుడే పరమహంసగాడింటికి వెళ్ళు. ఇంతమంది కార్మికుల కంట్లో కారం జల్లి; అన్యాయం యెలా చెయ్యగలిగావు? నువ్వు లక్షలు సంపాదించుకోవడం కోసమా నలభై రోజులు మాచేత సమ్మె చేయించావు? నిన్ను నమ్ముకొని బతుకుతున్న మా నెత్తురుకూడే నీ క్కావలసి వచ్చిందా? అని గట్టిగా అడుగు. అణ్ని బయటకి లాగు. వీలుంటే పదవినుండి తప్పించు. నువ్వు నడిపించు. నీవాళ్ళ కష్టాల్ని నువ్వే చూడు. నన్ను సాయంగా ఉండమంటావా? ఉంటాను. సాక్ష్యం రమ్మంటావా? వస్తాను." ఇంకా చాలా చాలా నూరిపోశాడు గొర్రెపిల్ల బుర్రలో. ఆవేశం పుట్టించాడు. గుండెబలం యిచ్చాడు. తన జాతి మనుషులకోసం యేదో చెయ్యాలనే తపన కలిగించాడు.

గొర్రెపిల్ల ఆలోచనలో పడగానే—నారాయణ తర్వాత జరిపించవలసిన కార్యక్రమాన్ని నెమరువేసుకుంటూ వెళ్ళిపోయాడు.

* * *

జీవితంలో తొలిసారి వివేకం ఓడిపోయాడు.

ఎప్పుడండీ?

అసలు వివేకం యెప్పుడు ఓడిపోలేదు గనుక. శ్రీరామచంద్రుణ్ణి మోసంచేసి, అతని అర్ధాంగి సీతాదేవిని రావణాసురుడు లంకకు తీసుకొని పోయినప్పుడు వివేకం ఓడిపోలేదా? జూదంలో ధర్మరాజుని ఓడించి, కౌరవులు—అన్నదమ్ములనికూడా ఆలోచించకుండా పాండవుల్ని అడవులకి పంపించిన రోజున వివేకం ఓడిపోలేదా? ఇప్పుడూ అదే పరిస్థితి.

డిగ్రీలు చేతబట్టుకొని ఇంటర్వ్యూకి వెళ్ళి, ఆశగా ఉద్యోగంకోసం యెదురుచూస్తున్నప్పుడు—మినిస్టరుగారి బంధువు రికమెండేషన్‌తో అది కాస్తా యెగరేసుకుపోయినప్పుడు వివేకం ఓడిపోవడంలేదా? ఒంటరిగా నిస్సహాయంగా జీవితంలో మిగిలిన అందమైన అమ్మాయిల్ని జాలితో చేరదీసి, విదేశాలకు అమ్ముకున్నప్పుడు వివేకం ఓడిపోవడంలేదా? డబ్బుకోసం మమకారాన్ని చంపుకొని, కన్నబిడ్డలకి తల్లిదండ్రులకు మధ్య అగాధాలు యేర్పడినప్పుడు వివేకం ఓడిపోవడంలేదా? ప్రతి రోజు, ప్రతి చోట ఎన్నో రకాలుగా వివేకం ఓడిపోతున్నప్పుడు—ఈ వివేకం ఓడిపోవడంలో వింత లేదు. ఆశ్చర్యంలేదు.

**అయితే**—ఈ వివేకం యెలా ఓడిపోయాడనే ఆసక్తి మీకుంది కదూ?

వివేకానికి పాతికేళ్ళ వయస్సు. చిన్నప్పట్నుంచి మురికిపేటలో పెరగడంచేత యెన్నో కష్టాలు అనుభవంలోకి వచ్చాయి. ఆ వయసులోనే అతనికి చాలా విషయాలు తెలిసిపోయాయి. ఆకాశం కిందికి దిగిరాదని, మురికిలో ఉండేవాడు మీదికి రాలేడని, పేదవాడి చెమటతో లేచిన కట్టడాల్లో కులికేది ఉన్నవాడేనని, కర్మాగారపు పొగగొట్టాల్లో కాలి బూడిదయ్యేది కార్మికులేనని, రిక్షా రాముడు తన పిల్లలకి డబ్బు లేకపోవడంవల్లే చదువు చెప్పించలేదని, రాజయ్య కూతురు లేచిపోవడానికి కారణం అతని పేదరికమేనని....ఇలా ఎన్నో ఎన్నో అతనికి తెలుసు. ఏదో ఏదో చేసి—ఈ వ్యవస్థనీ, ఈ మనుషుల్నీ మార్చాలని ఉంది. నింగీ నేలా ఒకటిచేసి, మనసుకి మనసుకి మధ్య ఉన్న తేడాల్ని తుడిచేయాలని ఉంది.

అతను అనుకుంటున్నాడే గాని—అతన్ని ఒక్క అడుగు ముందుకి వెయ్యనివ్వడం లేదు, తనతో కలిసి బతుకుతున్న మనుషులే.

అక్కడ ఉన్న కంపెనీలో అతనూ ఓ చిన్న కార్మికుడు. అతను చదువుకోలేదు. కానీ, జీవితంనుండి చాలా పాఠాలు నేర్చుకున్నాడు. అతనికి అమ్మా, అక్కా, నాన్నా, అన్నా ఎవరూ లేరు. ఆ మురికిపేటలో ఉన్నవాళ్ళందరూ అతని తల్లిదండ్రులే. అన్నదమ్ములే. అక్కచెల్లెళ్ళే. ఆత్మీయులే. వాళ్ళకోసం తను కాలిపోయినా ఫరవాలేదు. వాళ్ళ బతుకులోకి కాంతి రావాలి. ఆ బతుకులు తెల్లవారిపోకూడదు. ప్రతి క్షణమూ వివేకం ఆలోచిస్తుంటాడు.

మొన్నటికి మొన్న కార్మికులంతా సమ్మె చేసినప్పుడు ఏమైంది?

ఒక్క మాటకోసం, ఒక్క ప్రయోజనం కోసం అంతా కట్టుబడి వున్నారు. కష్టాల్ని దిగమింగుతూ, జీవిత పోరాటం సాగించారు. మురికిపేటలో ఉన్నవాళ్ళంతా పస్తులతో మలమల మాడిపోయారు. ఆ సమయంలోనే—పన్నెండేళ్ళ సత్తిబాబు బ్లాక్‌లో టిక్కట్లు అమ్ముతుండే దొమ్ములాట జరిగి, కాలు విరగ్గొట్టుకున్నాడు. చిన్నతాత మందులు కొనలేక, దగ్గి దగ్గి దగ్గి చచ్చిపోయాడు. పిల్లల ఆకలి తీర్చడంకోసం కాలు జారినందుకు తాయార్ని కత్తితో పొడిచేశాడు, వెంకటేశం. కాలేజీ కుర్రాళ్ళ క్యారేజీల్లో అన్నం దొంగతనం చేసినందుకు పదహారేళ్ళ పంకజాన్ని పోలీసులకు అప్పగించారు. చాలా జరిగిపోయాయి.

ఎన్ని ఆపదలు వచ్చినా, ఎవరూ జంకలేదు. అన్నిటికీ ఆ పరమహంసబాబు ఉన్నాడనుకున్నారు. కానీ, ఆ బాబు ఏం చేశాడు?

అర్ధాంతరంగా సమ్మెను ఆపుజేశాడు.

అతను సాధించినది యేమిటో చెప్పలేదు. ఇంతకాలం చూస్తూ బతుకుతున్న కార్మికులకు చల్లని కబురు వినిపించలేదు. పరమహంస మాట విని, అంతా పనిలో చేరిపోయారు.

ఆ బాబుమీద వివేకానికి యెప్పుడో అపనమ్మకం యేర్పడింది. నిజంగా అతను కష్ట

జీవుల్ని ఆదుకునేవాడైతే—అంత కలిమి అతనికెలా వచ్చింది? కష్టాల్ని పంచుకోవలసినవాడే తమ కష్టాన్ని కాజేస్తున్నాడు. నమ్ముకున్న నాయకుడే తమని నాశనం చేస్తున్నాడు. అతను చేస్తున్న అన్యాయాన్ని వదిలించాలి. ఆ మాట వివేకం అందరిముందూ చెప్పాడు.

పరమహంసబాబు మంచిచేస్తాడని నమ్మడం చేతనో, పెద్దవాణ్ని ఎదిరించే దమ్ము లేకనో, వివేకం మనసు యెదగలేదనో, చీకట్నుంచి బయటపడాలనే బుద్ధి వాళ్ళకి లేకనో—మరి యెందుచేతనో యెవరూ వివేకం మాట వినిపించుకోలేదు.

అదిగో—అలాంటప్పుడు నారాయణ నారాయణుడిలా ప్రత్యక్షమై, వివేకానికి రామకృష్ణ పరమహంసలా బోధ చేశాడు. వివేకం మనసులో అనుమానం బలపడింది. అక్రమాన్ని చూస్తూ వివేకంగా సహించలేకపోయాడు.


వివేకం ఒంటరిగా ముందుకు నడిచాడు.

"అమ్మా! బాబుగారున్నారా?" వివేకం చేతులు కట్టుకొని అడిగాడు. అతని మాటలో ఆవేశం అయితే వుందిగాని తరతరాలుగా పెద్దవాడి ముందు కైమోడ్పు చేతులతో ఒదిగి ఉండాలనే యేదో ఆచారం లాంటిది ఆ క్షణంలో అతన్ని ఆవహించింది.

డాఫ్నె డి మారియర్ రాసిన 'రెబకా' నవల చదువుతున్న—'అమ్మా' అని పిలవబడిన లావణ్య పుస్తకంనుండి చూపు మరల్చి, తల పైకెత్తి చూసింది. వివేకం రాకకోసమే ఎదురు చూస్తున్నట్లు చిరునవ్వు నవ్వింది.

అతని ప్రశ్నకి జవాబులేదు. అతన్ని రమ్మంది. ఏదోలా చూస్తూంది. మరేదోలా మాట్లాడుతుంది. ఎందుకని? ఏమో తెలీదు అనుకున్నాడు, వివేకం.

"అమ్మా! మీతో కబుర్లు చెప్పటానికి నేను రాలేదు. మా కడుపులు మండుతున్నాయి. ఆ మంటకి కారణమైన బాబుగార్ని పిలవండి. ఇన్నాళ్ళు బాబుగార్ని నమ్మి అతను చూపించిన దారిలో నడిచాం. మేం వెర్రివాళ్ళం. మాకు యేమీ తెలీదు. కానీ, నొప్పి కలిగిన తర్వాత-



"శృంగాభలం తైలం వాడానా? లేకపోతే పండక్కి అల్లుడొచ్చాడా?"

"రెండూ లేదు! తిరపతి వెళ్ళొచ్చాను!"

---

బాబుగారు మమ్మల్ని ముళ్ళదొంకలుమీదికి లాగడంలేదని యెలా అనుకోమంటారు?....ఈ యింట్లో పరుచుకున్న ప్రతి అంగుళం సుఖం మా కన్నీటి బొట్టేనమ్మా. ఇప్పుడు మా కన్నీరు ఆవిరైపోయింది. నలభై రోజులు సమ్మె చేసి, అలిసిపోయాం—అయ్యగారితో చెప్పండి. మురికిపేట మనిషి వచ్చాడని. బోనసుల విషయమై జవాబు కావాలంటున్నాడని చెప్పండి. ఇంకా మమ్మల్ని మోసం చేయొద్దని తప్పించుకోవడానికి ప్రయత్నం చేయొద్దనికూడా చెప్పండి. మా శక్తి కదిలితే—మమ్మల్ని యెవరూ ఆపలేరు. చేనును మేసే కంచె అవసరం మాకు లేదమ్మా... పిలవండి. పిలవండి. పిలవండి" మొదటిసారి పేదరికం పెదవి విప్పింది. వివేకంలో కొత్త రక్తం ప్రవహించింది.'

అతని మాటలకి లావణ్య చీదరించుకుంది. గబ గబా ఒకటి....రెండు....పది మెట్లు యెక్కింది. యెక్కినంత తొందరగా కిందికి జారిపోయింది. కెవ్వున అరిచింది. స్టెయిర్ కేస్ మీది నుండి దొర్లుకుంటూ కింద పడిపోయింది.

వివేకం ఆదుర్దాగా ఆమెని చేతుల్లోకి తీసుకొని సోఫామీద వేయబోయాడు.

అంతే! లావణ్య దిగ్గున లేచింది. రెండు చేతులతో అతని గుండెలమీద దబ దబా

బాదింది. అతని చొక్కా. బనీనూ పిచ్చిగా చింపేసింది. ఆమె చీరా, బ్లవుజూ, గాజులూ, జడ, పూలూ, ఒకటేమిటి అవసరమైన వాటిని చిందరవందర చేసింది.

“హెల్ప్.... హెల్ప్....” అంటూ పెద్ద కేక పెట్టింది.

వివేకం విస్తుపోయాడు.

నాటకంలో చంద్రమతిని నరకడానికి హరిశ్చంద్రుడు సిద్ధపడినప్పుడు విశ్వామిత్రుడు, నక్షత్రకుడు, దేవతలు స్టేజీ నాలుగు వింగుల్నుంచీ పరుగెత్తుకువచ్చినట్లు—పరమహంస, నారాయణ, ఆ రోజు ఆ యింటికి అతిధిగా విచ్చేసిన ఓయస్సయిగారు ఆ క్షణంలో ప్రత్యక్షమయ్యారు. ఆశ్చర్యం, ఎలా వచ్చారు? ఆ మాత్రం పాఠకులు ఊహించగలరు.

“ప్లీజ్, యిన్‌స్పెక్టర్.... హెల్ప్‌మీ.... హెల్ప్‌మీ....” ఒక్కసారి పదిమంది దుశ్శాసనులు మీదపడి, పాడుచేసిన ద్రౌపదిలా ఉంది లావణ్య.

ఇన్‌స్పెక్టర్ హెల్ప్ చేయటానికే కదా వచ్చాడు.

చేయాల్సిన హెల్పంతా చేశాడు.

వివేకానికి—కార్మికుల్ని రెచ్చగొట్టడమన్నా యజమానుల్ని యెదిరించడమన్నా, సమ్మెలు జరిపించడమన్నా, యూనియన్ ప్రెసిడెంట్ పదవన్నా ఇష్టం. అందుకే—జరిగిన సమ్మెలో కార్మికులకు పరమహంసబాబు చాలా అన్యాయం చేశాడని, యాజమాన్యందగ్గర డబ్బు తీసుకున్నాడని పుకార్లు లేవదీశాడు. పదిమందిని కూడదీసుకోవడానికి ప్రయత్నాలు చేశాడు. ఆ మిషతో బాబుగారింట్లో ప్రవేశించాడు. తనకి అడ్డు ఉన్న ప్రెసిడెంట్‌గార్ని తొలగించడానికి వచ్చాడని చెప్పటానికి అతని జేబులో కనిపించిన చాకు చాలు. అతని ఆవేశాన్ని, కుట్రని పసిగట్టిన లావణ్య—ఇంట్లో పరమహంసబాబు లేరని చెప్పింది. బాబుగారిమీద పగతో కోపంతోఅమ్మగార్ని బలాత్కరించబోయాడు. అమానుషంగా ప్రవర్తించాడు. ఇరవై ఏళ్ళుగా ఒళ్ళు మరిచి, అలసటా స్వార్థమూ లేకుండా, కార్మికులకోసం రాత్రి పగలూ పనిచేస్తున్న బాబుగారు యే రోజూ వివేకంలో వక్రబుద్ధిని గమనించలేదు. అతని ఉప్పు తిని, బతుకుతున్న నారాయణ ముందుగా హెచ్చరించకపోతే—బాబుగారు ప్రమాదంలో పడేవాడు. ఇలా ఎన్నో ఎన్నో ఆరోపణలు వివేకంమీద బనాయించారు హెల్ప్ చేయటానికి వచ్చిన యస్సయిగారు.

అందరూ కుమ్మక్కయిపోయారు. కుట్ర చేశారు. తనవాళ్ళ చేతనే ‘ఛీఛీ’ అనిపించారు. పేదవాడి నోటిని—పలుకుబడి, అధికారం అనే ముతక దారాలతో కుట్టివేశారు.

వివేకానికి సంకెళ్ళు వేశారు.

మనిషి వివేకంలాగే, మన వివేకం కూడా జీవితంలో ఓడిపోయాడు. తొలిసారి ఓడిపోయాడు.

“కార్మికులందర్నీ నమ్మించడంకోసం, వివేకాన్ని మోసగించవచ్చు. జారిపోయిందనుకున్న మంచితనం వాళ్ళదగ్గర మళ్ళీ పరమహంసబాబు సంపాదింకోవచ్చును. నారాయణ ఉప్పుతిని బతుకుతున్నందుకు మళ్ళీ స్వామిద్రోహం తల పెట్టక పోవచ్చును. లక్షరూపాయలు యిచ్చి కొడుకు ముచ్చట తీర్చినందుకు మొగుణ్ణి—లావణ్య మెచ్చుకోవచ్చును. ఇంపాలా కారులో రాజకుమారుడిలా బాబ్జీ తిరగవచ్చును. వెలుగుని చీకటి మింగేస్తూ ఉండవచ్చును.

“కానీ, ఈ కథ ఇంతటితో ఆగిపోయేది కాదు.

“ఈ రోజు వివేకాన్ని ‘ఛీఛీ’ అనిన అతని జాతి మనుషుల్లోనే రేపు మరో వివేకం పుడతాడు. అతని తర్వాత యింకొక వివేకం. మళ్ళీ వివేకం. వివేకం. వివేకం. వివేకం. ఒక రోజున—వెలుగుని చూసి చీకటి పారిపోతుంది. అప్పుడు—ఈ వ్యవస్థా, పరమహంసబాబు చీకటిలో కలిసిపోతారు.”

జైలు గోడల నడుమ ఒక నంబరుగా కుంచించుకుపోయిన వివేకంలో చైతన్య స్రవంతి సాగిపోతుంది. □